# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 76 ప్రకాశం, సోమవారం 15-12-2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మద్యం తాగి వాహనాలు నడిపిన 79 మందికి షాక్ ఇచ్చిన కోర్టు



క్రైమ్ కౌంటర్ న్యూస్... ప్రకాశం జిల్లా..... ఒంగోలు డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురికి ఒకరోజు జైలు శిక్ష, మరో 76 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి శనివారం తీర్పు చెప్పారు. ఒంగోలు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 78 మందిని స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు ట్రాఫిక్ సీఐ జగదీష్ తెలిపారు. వీరిలో ఇద్దరికి ఒకరోజు జైలు శిక్ష విధించగా, 76 మందికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 7.60 లక్షలు జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు....

## కంభం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం



క్రైమ్ కౌంటర్ న్యూస్... ప్రకాశం జిల్లా.... కంభం రైల్వే స్టేషన్ సమీపంలో ఒక గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైనది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడింది

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రంగా విమర్శించారు. ఆదివారం తన నియోజకవర్గంలో పర్యటించిన ఆమె, పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు.పర్యటనలో భాగంగా కక్కలపల్లి గ్రామ చెరువుకు గ్రామస్తులతో కలిసి జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మీడియాతో మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు సైతం నీరు అందుతోందని అన్నారు. ఆయన కృషితోనే చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయని, దీంతో రైతులు, గ్రామ ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని ఆరోపించారు. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, ఆయన పాలనతోనే గ్రామాలు సస్యశ్యామలం అవుతున్నాయని పరిటాల సునీత పేర్కొన్నారు.



## మార్కాపురం నియోజకవర్గ రెడ్ల సంఘం ప్రెసిడెంట్ అయిన .సుబ్బారెడ్డి తల్లి స్వర్గస్తులయ్యారు





క్రైమ్ కౌంటర్ న్యూస్....ప్రకాశం జిల్లా..... మార్కాపురం నియోజకవర్గ రెడ్ల సంఘం ప్రెసిడెంట్ అయినలిజి.సుబ్బారెడ్డి తల్లి స్వర్గస్తులయ్యారు మార్కాపురం నియోజకవర్గ వైయస్సార్ సిపి పార్టీ నాయకులైన లి%ాజుజ% స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఉడుముల కోటిరెడ్డి , వారి కుటుంబాన్ని పరామర్శించారు....

## ఆహ్వాన పత్రిక అందజేత



క్రైమ్ కౌంటర్ ప్రతినిధి టి. నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,భారతరత్న అట్లాబిహారి వాజపేయి విగ్రహఆవిష్కరణ మహొత్సవకార్యక్రమానికి స్థానిక శాసన సభ్యుల ఇంటూరీ నాగేశ్వర రావు ఆహ్వానించి ఆహ్వాన పత్రికను ఆయనప్రతినిధి వడ్లమూడి సురేష్ కు బా జ పా నాయకులు గట్టమనేని హరిబాబు, ముప్వల భూషయ్య, జొన్నాదు ల రాఘవయ్య, తదితరులు అంద జేశారు.

## కొడాలి నాని, వల్లభనేని వంశీపై బుద్దా వెంకన్న ఘాటు వ్యాఖ్యలు



డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ : వైసీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్‌పై టీడీపీ నేత బుద్ధా వెంకన్న తీవ్ర విమర్శలు చేశారు. కొడాలి నాని, వల్లభనేని వంశీ ఫిట్ నెస్, తిండి విషయాలను ప్రస్తావిస్తూ సెటైర్లు గుప్పించారు. ఆరు నెలల తర్వాత ప్రజా ఉద్యమాల్లోకి వస్తానంటూ కొడాలి నాని ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుద్ధా వెంకన్న తనదైన శైలిలో చురకలు వేశారు. ఒకరికి గుండె సరిగా పనిచేయదని, ఇంకొకరికి ఊపిరితిత్తులు, వెన్నుపూస సరిగా లేవంటూ కొడాలి నాని , వల్లభనేని వంశీని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసారు. కొడాలి నాని, వంశీ వంటి నేతలు ఇలా బలహీనంగా ఉంటే.. వారి లీడర్ ఎంత బలహీనంగా ఉన్నాడో తెలుస్తోందన్నారు.

## 154 మందికి కంటి వైద్య పరీక్షలు



క్రైమ్ కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు ,పట్టణంలోని ఆది ఆంధ్ర కాలనీ (9వ వార్డు)లో ఎల్వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలను చేయించారు. ఈ పరీక్షలను 154 మంది వినియోగించుకున్నారు. పురుషులు 57 మంది స్త్రీలు 97 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమ%శీ%లో ఎల్వి ప్రసాద్ కంటి హాస్పటల్ సిబ్బందికి,ఆది ఆంధ్ర కాలనీ గ్రామ పెద్దలకు, సహాయ సహకారాలనుగ్రామ యువతకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న గ్రామ ప్రజలకు ఏఐఎస్ఎఫ్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలను తెలియ జేశారు.

## అభివృద్ధిలో ఏపీ పరుగులు

### మోదీ, చంద్రబాబు, పవన్ సారథ్యంలో ముమ్మందుకుఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ

### మదనపల్లె, రేణిగుంటల్లో మాజీ ప్రధాని వాజపేయి విగ్రహావిష్కరణ



డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ : మదనపల్లె/తిరుపతి(విద్య)/తిరుమల, డిసెంబరు 14: మాజీ ప్రధాని వాజపేయి నిష్కళంక నేత, అభివృద్ధి ప్రధాత అని, ఆయన రాజకీయ జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ అన్నారు. ఆదివారం రాష్ట్రానికి వచ్చిన ఆయన అన్నమయ్య జిల్లా మదనపల్లె, తిరుపతి జిల్లా రేణిగుంట మండలం మర్రిగుంట కూడళ్లలో ఏర్పాటు చేసిన దివంగత ప్రధాని వాజపేయి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ధామీ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఏపీ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణంతో పాటు గూగుల్ డేటా సెంటర్, తదితర పరిశ్రమలు వస్తున్నాయని, ఇందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పేదల సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని, దీంతో పేదల జీవన ప్రమాణాల పెంపుతో పాటు వారి ఆర్థిక స్థితిగతుల్లో మార్పు వస్తుందని చెప్పారు. 'దేవభూమి ఉత్తరాఖండ్ నుంచి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నడయాడిన పుణ్యభూమి మదనపల్లెకు రావడం నా అదృష్టంగా భావిస్తున్నా.. జాతీయ గీతం జనగణమనను బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించిన రవీంద్రునికి, అందుకు వేదికైన మదనపల్లెకు నమస్కారం చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు.

మాజీ సీఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వాజపేయి పనిచేశారని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశయాలకు మోదీ కార్యరూపం ఇస్తున్నారని అన్నారు. పాలన, అభివృద్ధిలో వాజపేయి స్ఫూర్తి, ప్రేరణను భవిష్యత్తు తరాలకు అందించడానికేఅటల్-మోదీ సుపరిపాలన యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. అటల్ హయాంలో హైవేల నిర్మాణం, ఎయిర్‌పోర్టులు, టెలికాం, పోర్టుల కనెక్టివిటీతోనే దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి వైస్ చైర్‌పర్సన్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో పుష్కర్ సింగ్ ధామీ

మదనపల్లె, రేణిగుంట కార్యక్రమాల అనంతరం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఆదివారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడారు. స్వామిని దర్శించుకొని ఆనందానికి లోనయ్యానన్నారు. టీటీడీ వ్యవస్థ అద్భుతంగా ఉందని, కొన్ని లక్షల మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తున్నప్పటికీ.. టీటీడీ మంచి ఏర్పాట్లు చేస్తోందని ప్రశంసించారు. భారతదేశం విశ్వ గురువుగా ఆవిర్భవించే సమయం ఆసన్నమైందని, ప్ర?ధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ సంకల్పాన్ని తామంతా స్వీకరించామని పేర్కొన్నారు.

# తిరుపతి ప్రభుత్వ కాలేజీలో అన్యమత బోధన కలకలం




**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** తిరుపతిలో మరోసారి అన్యమత ప్రచారం వివాదం తెర మీదకు వచ్చింది. ప్రభుత్వ కళాశాలలో.. అది కూడా టీటీడీ పరిపాలన భవనానికి ఎదురుగా ఉన్న కాలేజీలోనే ఓ అధ్యాపకురాలు అన్యమత బోధన చేసింది. ఈ విషయం కాస్త ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో ఆమె మీద వేటు వేశారు. విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అన్యమత బోధన తీవ్ర కలకలం రేపింది. కళాశాలలో కాంట్రాక్టు ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్న మాధవి.. క్లాస్ రూమ్ బోర్డుపై రాసిన అన్యమత వ్యాఖ్యలతో కూడిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న కళాశాలలోనే ఇలా అన్యమత ప్రచారం జరగడం పట్ల హిందూ సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. కళాశాల ఎదుట ఆందోళనకు దిగాయి. ఇది కాస్త ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించారు. కాంట్రాక్టు అధ్యాపకురాలిని విధుల నుంచి తప్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాంట్రాక్టు లెక్చరర్ మాధవి.. విద్యార్థులకు యేసును పూజించమని, నమ్మమని చెబుతూ తరగతి గదిలో ఉన్న బోర్డుపై కొన్ని మాటలను రాశారు. తమ్ముడు, అమ్మ, నాన్న, యేసుప్రభువు.. చెల్లి, అక్క, అన్న, యేసుక్రీస్తు అని రాశారు. దీనిని అక్కడే ఉన్న కొంతమంది విద్యార్థులు తమ మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేశారు. ఆ తర్వాత ఈ వీడియో కాస్త సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో విపరీతంగా వైరల్ అయ్యింది. తిరుపతిలాంటి ఆధ్యాత్మిక పట్టణంలో.. అది కూడా ప్రభుత్వ కళాశాలలో ఇలాంటి అన్యమత ప్రచారం చేయడాన్ని హిందూ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. విద్యార్థులను ప్రభావితం చేసేలా ప్రవర్తించిన మాధవి తీరును తప్పుపట్టారు.

సదరు అధ్యాపకురాలికి ఆమె దేవుడి మీద దైవభక్తి ఉంటే తన నివాసంలో, చర్చిల్లో ప్రార్థనలు చేసుకోవాలి తప్ప చదువుకునే కాలేజీలకు వచ్చి ఇలాంటి ప్రచారాలు చేయడం సరికాదని హితవు పలికారు. భవిష్యత్తులో ఎవరైనా ఇలా విద్యాసంస్థల్లో మత ప్రచారాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. టీటీడీలో పనిచేస్తున్న నలుగురు అన్యమత ఉద్యోగులను కొద్దిరోజుల క్రితమే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. హిందూ ధార్మిక సంస్థలో ఉంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని వారిపై ఈ చర్యలు తీసుకున్నారు.

# పులివెందులలో బీటెక్ రవి ఇళ్లకు తాళాలు వేసిన గ్రామస్థులు

**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి బీటెక్ రవికి చేదు అనుభవం ఎదురైంది. వేంపల్లి మండలంలో బీటెక్ రవికి నిరసన సెగ తగిలింది. మండలంలోని అమ్మగారిపల్లి గ్రామంలో కొన్ని కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యాయి. దీంతో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించేందుకు బీటెక్ రవి అక్కడకు వెళ్లారు. అయితే బీటెక్ రవి రాకతో అమ్మగారిపల్లి గ్రామస్తులు.. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లిపోయారు. బీటెక్ రవి వస్తున్నారనే విషయం తెలుసుకుని ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో ఈ విషయం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు అమ్మగారిపల్లి గ్రామం మొదటి నుంచి వైఎస్ కుటుంబానికి అండగా ఉంటూ వస్తోంది. అయితే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొన్ని కుటుంబాలు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యాయి. దీంతో వారికి కండువా కప్పేందుకు బీటెక్ రవి వెళ్లగా.. ఇలా చేదు అనుభవం ఎదురైంది. మరోవైపు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో టీడీపీ జెండా ఎగరేయాలని టీడీపీ గట్టి పట్టుదలతో ఉంది.

ఇటీవల జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలను సైతం ఇదే రీతిలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ.. బీటెక్ రవి సతీమణిని జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిపి విజయం సాధించింది. ఈ విజయం ఇచ్చిన ఉత్సాహంతో నియోజకవర్గంలో టీడీపీని మరింత పటిష్టపరిచేందుకు బీటెక్ రవి ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగా గ్రామాల్లో పార్టీలో చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి కాలనీ నుంచి30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీ నేత సాయికుమార్‌తో పాటు 30 కుటుంబాలు టీడీపీ



కండువా కప్పుకున్నాయి. తాజాగా అమ్మగారిపల్లె గ్రామంలోనూ కొంతమంది పార్టీ మారేందుకు సిద్ధపడగా.. గ్రామస్థులు మాత్రం తమ నిరసన ఇలా వ్యక్తం చేశారు. మరోవైపు సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందుతోందంటున్నారు బీటెక్ రవి. ఈ కారణంగానే పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయని అంటున్నారు. వైఎస్ కుటుంబం నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ పులివెందుల జనం తాగునీటి సమస్యను తీర్చలేదని ఆరోపిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

# 14 ఏళ్ల తర్వాత బయటపడ్డ నిజం.. ఆ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఊడింది




**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే, ప్రభుత్వం దాని వల్ల భూమి, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు ఉద్యోగం కూడా ఇస్తుంది. ఇప్పుడు మనం చెప్పుకోబోయే వ్యక్తి కూడా ఇలా ఒక ప్రాజెక్టు భూ నిర్వాసితుడి కోటాలో ఉద్యోగం పొందినవాడే. 14 ఏళ్ల క్రితం (2011లో) ఆయన ఉద్యోగంలో చేరారు. ఇప్పుడు సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే 14 ఏళ్ల క్రితం ఆయన దాచిన ఓ రహస్యం తాజాగా బట్టబయలు అయ్యింది. దీంతో ఆ ఉద్యోగిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా పరిధిలో వెలుగు చూసింది. తాజాగా ప్రభుత్వం తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోన్న అనిల్ కుమార్ రెడ్డి అనే వ్యక్తిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కారణం, సదరు ఉద్యోగి నకిలీ సర్టిఫికెట్‌లతో ఉద్యోగం పొందారని తేలడమే. తెలుగుగంగ నీటి ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన నిర్వాసితుల కుటుంబ సభ్యులకు 2011లో ప్రభుత్వం ఉద్యోగాలను ఇచ్చింది. వీరిలో అనిల్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. అతడి స్వస్థలం కడప జిల్లా, బద్వేలు మండలం, చౌటపల్లి.

అనిల్ కుమార్ రెడ్డి.. తన భూమి మునిగిపోయినట్లుగా ఫోర్జరీ సంతకాలతో అవార్డు సర్టిఫికెట్‌ను సృష్టించారు. అలా పొందిన నకిలీ సర్టిఫికెట్‌తో అతడు 14 ఏళ్ల క్రితం అంటే, 2011 జనవరి 29న తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో టైపిస్టుగా ఉద్యోగం పొందారు. ఆ తర్వాత.. తిరుపతిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ఆరు నెలల క్రితం సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది, బదిలీపై ఇటీవలే శ్రీకాళహస్తికి వచ్చారు.

అయితే తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 2011లో ఉద్యోగం పొందిన వారిలో కొందరు.. నకిలీ సర్టిఫికెట్‌లతో ఉద్యోగం పొందినట్లుగా కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తెలుగుగంగ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారిలో కొందరు నకిలీ సర్టిఫికెట్‌లతో ఉద్యోగాలు పొందినట్లు గుర్తించారు. ఈక్రమంలో డిసెంబర్ 10వ తేదీన వారిని శాశ్వతంగా విధుల నుంచి తొలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా ఉద్యోగం కోల్పోయిన వారిలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. వీరితో పాటు తెలుగుగంగ మాజీ ఉద్యోగిపై చీటింగ్ (మోసం) కేసును కూడా నమోదు

# విశాఖ బీచ్ రోడ్డుపై ఘనంగా జరిగిన నేవీ మారథాన్

**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** విశాఖపట్నంలో నేవీ డే వేడుకల సందర్భంగా ఆదివారం ఉదయం బీచ్ రోడ్డుపై నిర్వహించిన 'నేవీ మారథాన్' అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమం నగరవాసులకు, భారతీయ నౌకాదళ సిబ్బందికి ఒక ఉత్సాహభరితమైన అనుభవాన్ని అందించింది. సముద్ర తీరాన్ని అద్దిన ఆహ్లాదకరమైన వాతావరణంలో వేలాది మంది రన్నర్లు పాల్గొనడం ఈ కార్యక్రమానికి మరింత రంగు అద్దింది. నేవీ డే సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ మారథాన్ ఈ ఏడాది కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, తూర్పు నౌకాదళ కమాండ్ అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఉదయం సూర్యోదయ సమయంలోనే బీచ్ రోడ్డు రన్నర్లతో నిండిపోయింది. వివిధ విభాగాల్లో నమోదు చేసుకున్న పాల్గొనేవారు ఉత్సాహంతో పరుగులు పెట్టడం దృశ్యం ఆకట్టుకునేలా ఉంది. నేవీ అధికారులు, సిబ్బంది కూడా తమ యూనిఫాం ధరించి ఈ మారథాన్‌లో చురుకుగా పాల్గొన్నారు.ఈ మారథాన్‌లో నగరంలోని అన్ని వయసుల వారు, వివిధ వృత్తులకు చెందినవారు భాగస్వాములయ్యారు. కుటుంబ సమేతంగా వచ్చినవారు, యువత, విద్యార్థులు, ఫిట్‌నెస్ ప్రియులు ఈ కార్యక్రమంలో ఉత్సాహం చాటారు. సముద్ర గాలులు, బీచ్ రోడ్డు అందాల మధ్య పరుగెత్తడం పాల్గొనేవారికి ఒక విశిష్టమైన అనుభూతిని కలిగించింది. ఈ కార్యక్రమం ద్వారా ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంచడంతో పాటు నౌకాదళం పట్ల గౌరవాన్ని కలిగించే ప్రయత్నం జరిగింది. నేవీ మారథాన్ విజయవంతంగా ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం నగరవాసుల మధ్య నేవీ సిబ్బందితో సన్నిహిత సంబంధాలను పెంచడంలో మరింత దోహదపడింది. నేవీ డే వేడుకల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నౌకాదళం యొక్క సేవలను, త్యాగాలను ప్రజలకు గుర్తు చేస్తాయని అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ మారథాన్ విశాఖ నగరానికి ఒక ఉత్సవ వాతావరణాన్ని నింపింది.

# ఇంటర్ బాలికకు డ్రగ్స్ అలవాటు చేసి..



సమాజంలో రోజురోజుకూ పరిస్థితులు దిగజారుతున్నాయి. డ్రగ్స్, మత్తుపదార్థాల కట్టడికి ప్రభుత్వాలు ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా.. ఆ మహమ్మారులు చాప కింద నీరులా విస్తరిస్తూ యువత భవితను నాశనం చేస్తున్నాయి. కాలేజీలలోకి ప్రవేశించిన డ్రగ్స్ భూతం.. ఎంతో మంది యువతీయువకుల బంగరు భవిష్యత్తును నాశనం చేస్తోంది. వారి కన్నోళ్లకు కడుపుకోతను మిగుల్చుతోంది. కాలేజీకి వెళ్లిన బిడ్డ.. చక్కగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలుస్తారని ఊహించిన ఆ తల్లిదండ్రుల ఆశలు పేకమేడలా కూలిపోతున్నాయి. కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు కారణమవుతోంది. అలాంటి ఘటనే గుంటూరు జిల్లాలో చోటుచేసుకుంది.

గుంటూరుకు చెందిన ఓ 17 ఏళ్ల బాలిక స్థానికంగా ఉండే ఓ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. అదే కాలేజీలో చదివే ఓ సీనియర్‌తో ఆమెకు ఇన్?స్టాగ్రామ్ ద్వారా పరిచయమైంది. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు ప్రేమిస్తున్నానంటూ ఆ బాలిక వెంట పడ్డాడు. ఆమెను ప్రేమ పేరుతో నమ్మించాడు. డ్రగ్స్ కూడా అలవాటు చేశాడు. ఆ తర్వాత తన రూమ్‌కు తీసుకెళ్లిన యువకుడి.. ఆమెకు మత్తుపదార్థాలు ఇచ్చి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ రావటం ప్రారంభించాడు. ఈ దృశ్యాలను ఫ్రెండ్ సాయంతో ఫోటోలు, వీడియోలు తీయించాడు. అయితే ఇటీవల బాలిక తల్లి.. అమ్మాయి ఫోన్ పరిశీలించిన సమయంలో.. అందులో యువకుడితో సన్నిహితంగా ఉన్న ఫోటోలు ఆమెకు కనిపించాయి.

దీంతో బాలిక తల్లి.. ఈ విషయాన్ని బాలికను ప్రశ్నించింది. అయితే అప్పటికే డ్రగ్స్ మత్తుకు అలవాటు పడిన బాలిక.. తనను ప్రశ్నించిన తల్లిదండ్రులపై తిరగబడింది. వారిపైనే దాడి చేసింది. దీంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె అలా ప్రవర్తించేసరికి ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. తీవ్ర మనోవేదనతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అయితే కుటుంబసభ్యులు సకాలంలో గుర్తించడంతో ప్రాణాలు దక్కాయి. ప్రస్తుతం ఆమె గుంటూరు జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈ విషయం తెలుసుకున్న గుంటూరు ఎస్పీ, ఈగల్ విభాగం ఐజీ ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఈగల్ విభాగం ఐజీ రవికృష్ణ వెల్లడించారు. మరోవైపు యువకుడు, బాలిక ప్రేమించుకున్న సంగతి తెలిసిన ఆమె తల్లిదండ్రులు.. వేరే యువకుడితో ఆమెకు పెళ్లి చేయాలని నిర్ణయించారని.. ఇది తెలిసి బాలిక వారిపై గొడవపడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

# ఉచిత గ్యాస్ డబ్బులు అకౌంట్లోకి పడటం లేదా?



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీపం-2 పథకం పేరుతో ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా 2024 ఏడాది దీపావళి పండుగ సందర్భంగా ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించారు. అర్హులైన కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏటా మూడు సిలిండర్లు అందిస్తున్నారు. అయితే లబ్ధిదారులే తొలుత గ్యాస్ బుక్ చేసుకుని డెలివరీ సమయంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. సిలిండర్ డెలివరీ అయిన ఒకటి నుంచి రెండు రోజుల్లోగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ డబ్బులు జమ చేస్తూ వస్తోంది.

దీపం -2 పథకం కింద 2024 డిసెంబర్ నెలలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రారంభించారు. 2025 మార్చి 31వ తేదీ వరకూ ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకోవడానికి అవకాశం కల్పించారు. 2025 ఏప్రిల్ నుంచి 2025 జులై 31 వరకూ రెండో ఉచిత సిలిండర్ అందించారు. ఇక మూడో ఉచిత గ్యాస్ సిలిండర్‌ను 2025 ఆగస్ట్ నుంచి నవంబరు వరకు పంపిణీ చేస్తున్నారు. అయితే గ్యాస్ డబ్బులు అకౌంట్లలో జమయ్యే విషయంలో, గ్యాస్ సిలిండర్ డెలివరీ విషయంలో.. మొదటి, రెండో విడతతో పోలీస్తే మూడో విడత దారుణంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి.

సిలిండర్ తీసుకున్నప్పటికీ గ్యాస్ డబ్బులు అకౌంట్లలో పడటం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారుగా లక్షా 26 వేల మంది లబ్ధిదారులకు డబ్బులు పడాల్సి ఉందని లెక్కలు చెప్తున్నాయి. సుమారుగా 18 కోట్ల 80 లక్షల రూపాయలు గ్యాస్ డబ్బులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ కావాల్సి ఉందని సమాచారం. మరోవైపు అర్హులు అందరికీ గ్యాస్ సిలిండర్ రాయితీ డబ్బులు అకౌంట్లలో జమ అయ్యేలా చూస్తామని అధికారులు చెప్తున్నారు.

మరోవైపు గ్యాస్ సిలిండర్ రాయితీ డబ్బులు అకౌంట్లలో జమ కాకపోతే లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయం, ఎంపీడీవో ఆఫీస్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసే వీలుంది. అలాగే1967 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. గ్యాస్ ఈకేవైసీ సమస్య ఉంటే సంబంధిత ఏజెన్సీని కలవాలని అధికారులు సూచిస్తున్నారు.

## అవుకు రిజర్వాయర్ లీకేజీల మరమ్మత్తు పనులు వేగవంతం: మంత్రి జనార్దన్ రెడ్డి



**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** నంద్యాల జిల్లాలోని అవుకు రిజర్వాయర్‌ను రాష్ట్ర మంత్రి జనార్దన్ రెడ్డి ఇటీవల సందర్శించారు. ఈ సందర్శనలో రిజర్వాయర్‌లో గత 15 సంవత్సరాలుగా ఉన్న లీకేజీ సమస్యపై మంత్రి వివరాలు తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ సమస్య పట్ల నిర్లక్ష్యం వహించిందని మంత్రి ఆరోపించారు.

రిజర్వాయర్‌లోని లీకేజీలను పూర్తిగా నిర్మూలించేందుకు నిపుణుల బృందం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. లీకేజీలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, అధునాతన పద్ధతులతో కాంక్రీట్ నింపడం ద్వారా మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి నాణ్యతతో, లీకేజీలు మళ్లీ రాకుండా చూస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఈ మరమ్మతులతో రిజర్వాయర్ బలోపేతమవుతుందని మంత్రి వివరించారు.

ఇటీవల రిజర్వాయర్ కట్ట కొద్దిగా కుంగిపోవడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ విషయాన్ని గుర్తించిన మంత్రి, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని ఆయన భరోసా ఇచ్చారు. స్థానికులు ఈ విషయంలో ధైర్యంగా ఉండాలని కోరారు.

మరమ్మతు పనులు యుద్ధప్రాతిపాదికన జరుగుతున్నాయని, మరో 15 రోజుల్లో పూర్తవుతాయని మంత్రి జనార్దన్ రెడ్డి ప్రకటించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత రిజర్వాయర్ సాధారణంగా పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

# అరటి ధరకు ఊపు

**అమరావతి, డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** రాష్ట్రంలో అరటి ధర పుంజుకుంది. కిలో కనీసంగా రూ.10, గరిష్ఠంగా రూ.17కు చేరింది. రాయలసీమ జిల్లాల్లో పండిస్తున్న అరటిని ఉత్తరాది రాష్ట్రాల నుంచి పండ్ల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అరటి ధర మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నాణ్యత లేని అరటి గత నెలలో కిలో రూ.2కు పడిపోగా.. కాస్త నాణ్యమైన అరటి కిలో రూ.7-8 దాకా పలికింది. దాదాపు నెల రోజుల పాటు ఎగుమతులు మందగించి, ధరలు పడిపోయాయి. ఇప్పుడు ఉత్తరాది వ్యాపారుల రాకతో కనీస ధర కిలోకు రూ.10కి చేరింది. తాజాగా పులివెందుల మార్కెట్‌లో గరిష్ఠ ధర రూ.16-17 దాకా పలికింది. గత నెల 20 నుంచి ఈ నెల 10 వరకు అరటి ధర పతనమైంది. సీమ ప్రాంతం నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా వంటి పెద్ద మార్కెట్లకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ ఏడాది మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో అరటి సాగు పెరిగి, నాణ్యమైన సరుకు తక్కువ ధరకు లభించడంతో వ్యాపారులు అక్కడి నుంచే ఎక్కువగా కొనుగోలు చేశారు. దీంతో కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో అరటికి డిమాండ్ లేకుండా పోయింది. ఎగుమతులు నిలిచిపోయి, తక్కువ ధరకు కూడా కొనేనాథుడు లేక రైతులు అరటి గెలలను పశువులకు మేతగా వదిలేయాల్సి వచ్చింది.రైతుల ఆవేదనపై స్పందించిన సీఎం

దాదాపు నెల పాటు అరటి మార్కెట్‌లో సంక్షోభం నెలకొంది. అరటి రైతుల ఆవేదనపై స్పందించిన సీఎం చంద్రబాబు.. ఉద్యానశాఖ అధికారులను ఉత్తరాది రాష్ట్రాలకు పంపి, వ్యాపారులతో చర్చలు జరిపించారు. డిసెంబరు రెండో వారం నుంచి సీమ అరటిని కొనుగోలు చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ మేరకు నాలుగైదు రోజుల నుంచి ఉత్తరాది వ్యాపారులు రాయలసీమ మార్కెట్లకు వస్తున్నారు. దీంతో కొనుగోళ్లు సాగుతుండటంతో అన్ని రకాల అరటి పండ్ల ధరలు టన్ను రూ.10 వేల పైనే పలుకుతున్నాయి. గరిష్ఠ ధర రూ.16 వేలు దాటింది. రాష్ట్రంలో లక్షా 30 వేల హెక్టార్లలో అరటి సాగులో ఉండగా, 87 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. రాయలసీమ రైతులు గ్రాండ్9 రకం అరటిని 34 వేల హెక్టార్లలో పండిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2 లక్షల టన్నుల అరటి ఎగుమతి లక్ష్యంగా పెట్టుకోగా, గత నెల మూడో వారంలో అరటి ధరల సంక్షోభం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 70 వేల టన్నుల అరటిని వ్యాపారులు కొనుగోలు చేశారని ఉద్యాన శాఖ డైరెక్టర్ కే శ్రీనివాసులు ఆదివారం చెప్పారు. అరటి ధర మరింత పెరుగుతుందని, అరటి మార్కెట్‌ను ప్రతి రోజు సమీక్షిస్తున్నట్లు వివరించారు.పుంజుకోని రబీ సాగు

అంచనాల్లో 32 శాతం మించని వివిధ పంటల సాగు విస్తీర్ణం’

రాష్ట్రంలో రబీ సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా.. పంట విస్తీర్ణం 32 శాతం మించలేదు. ఈ సీజన్‌లో 20.70 లక్షల హెక్టార్లలో 22 రకాల పంటలు సాగవుతాయనే అంచనా ఉండగా, ఇప్పటి వరకు 6.57 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి. మొంథా, దిత్వా తుఫాన్ల కారణంగా వరి కోతలు ఆలస్యమై, దాళ్వా వరి సాగు ఆలస్యమౌతోంది. మరోవైపు కృష్ణా డెల్టా, సాగర్ కుడి కాల్వ కింద వరి సాగుకు నీటి గ్యారెంటీ లేకపోవడంతో రైతులు సందిగ్ధంలో ఉన్నారు. 7.45 లక్షల హెక్టార్లలో వరి సాగవ్వాల్సి ఉండగా.. ఇప్పటికి 1.33 లక్షల హెక్టార్లలోనే నాట్లు పడ్డాయి. ఈశాన్య రుతుపవనాలు, వరుస తుఫాన్లతో వర్షాలు విస్తారంగా కురిసినా.. మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజల సాగు పెద్దగా పుంజుకోలేదు. ప్రస్తుతం చిరుధాన్యాలు 2.97 లక్షల హెక్టార్లకు బదులు 1.21, నూనె గింజలు 1.25 లక్షల హెక్టార్లకు బదులు 0.21, అపరాలు 8.20 లక్షల హెక్టార్లకు బదులు 3.44 లక్షల హెక్టార్లలోనే విత్తనం పడింది. పత్తి, పొగాకు, మిర్చి సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది.

# 3 వేల ఎకరాల్లో.. ఏపీలో బార్క్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ క్యాంపస్

**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో మరో ప్రతిష్ఠాత్మక సంస్థ కొలువుదీరనుంది. అనకాపల్లి జిల్లాలో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్.. నూతన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ ఉంది. అయితే ఈ సెంటర్‌ను విస్తరించాలని.. కొత్త ఆర్అండ్‌డీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని బార్క్ యోచిస్తోంది. కొత్త ప్రాజెక్ట్ కోసం 148.15 హెక్టార్ల భూమిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయాన్ని పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. బార్క్ నూతన ఆర్ అండ్ డీ క్యాంపస్ ప్రతిపాదనపై డిసెంబర్ నెల మొదటి వారంలో పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ సమీక్షించింది. అనంతరం కొత్త ప్రాజెక్టుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక కారణాలతోనే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ విశాఖపట్నం సమీపంలోని తూర్పు తీరంలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. సైట్ సెలక్షన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా, అటామిక్ ఎనర్జీ కమిషన్ ఈ స్థలాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు బార్క్ ప్రాజెక్ట్ కోసం అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే 3 వేల ఎకరాల రెవెన్యూ భూమిని సేకరించారు. అయితే తాజాగా కోరిన148.15 హెక్టార్ల అటవీ భూమి.. సేకరించిన ప్రాంతం పక్కనే ఉంది. అలాగే ప్రాజెక్ట్ స్థలం తీరప్రాంతం మధ్య ఉందని నిపుణుల కమిటీ వెల్లడించింది.



మరోవైపు బార్క్ నూతన రీసెర్చ్ అండ్ క్యాంపస్ నిర్మాణంలో భాగంగా.. కాంపౌండ్ వాల్, పంప్ హౌస్, వాచ్ టవర్లు, జోనల్ సెక్యూరిటీ ఫెన్సింగ్, పెట్రోలింగ్ రోడ్లు,డ్రెయిన్లు, సర్వీస్ లైన్లు వంటివి నిర్మించనున్నారు. ఈ కేంద్రం ద్వారా.. అణురంగంలో పరిశోధనలు చేయనున్నారు. ఇంధన భద్రత, ఆరోగ్యం, వ్యవసాయం, నీరు, ఇతర వ్యూహాత్మక రంగాలకు సంబంధించిన అప్లికేషన్ల కోసం పరిశోధనలు చేపట్టనున్నారు. మరోవైపు బార్క్ ప్రాజెక్టుకు సంబంధం లేని ఏ కార్యకలాపాల కోసం కూడా.. కేటాయించిన అటవీ ప్రాంతంలో ఎటువంటి మార్పులు అనుమతించమని నిపుణుల కమిటీ తెలిపింది. ఈ నేపథ్యంలో బార్క్ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలను ఏపీ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేదీ చూడాల్సి ఉంది.

# వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌పై చంద్రబాబును ఎదుర్కొన్న పరోక్ష వ్యంగ్యాస్త్రం



**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ వేడి చర్చలు రేగాయి. వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ట్వీట్ పరోక్షంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై వ్యంగ్యాస్త్రంగా మారింది. ఫుట్‌బాల్ ఆటను ఉదాహరణగా తీసుకుని రాసిన ఈ పోస్ట్ రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. ఓటములు, విజయాలు, మ్యాచ్‌ల ఆహ్వానాలు వంటి పదాలతో నిండిన ఈ ట్వీట్ రాష్ట్ర రాజకీయ ప్రత్యర్థుల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది. సోషల్ మీడియా యూజర్లు ఈ పోస్ట్‌ను విరల్ చేస్తూ వివిధ అర్థాలు చెబుతున్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ తన ట్వీట్‌లో వరుస ఓటములతో ఫుట్‌బాల్ ఆడటం మానేసిన వ్యక్తి గురించి ప్రస్తావించారు. దావోస్ సమావేశాల సమయంలో అర్జెంటీనా నుంచి వచ్చిన ఒకరు తనను కలిశారని, ఆటలో కొన్ని చిట్కాలు చెప్పానని అన్నారు. ఆ తర్వాత ఆ వ్యక్తి మెస్సీని ప్రపంచ ఛాంపియన్‌గా చేశాడని వ్యంగ్యంగా రాశారు. ఈ వివరణలో రాజకీయ సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, ఇది రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను గుర్తు చేస్తోంది.

మరోవైపు, హైదరాబాద్ రావాలా లేక అమరావతికి రమ్మని ఫోన్ కాల్స్ వస్తున్నాయని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈసారి విశాఖపట్నంలో లోకేశ్ టీమ్‌తో తన టీమ్ మధ్య మ్యాచ్ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించానని, దానికి ఆ వ్యక్తి ఆనందపడ్డాడని జోడించారు. ఈ మాటలు రాష్ట్ర రాజధాని వివాదాలు, మంత్రి కుమారుడు నారా లోకేష్‌ను ఉద్దేశించి రాసినట్లు కనిపిస్తున్నాయి. రాజకీయ పరిటాల్లో ఇలాంటి పరోక్ష వ్యాఖ్యలు సాధారణమే అయినప్పటికీ, ఇది కొత్త చర్చలకు తెరలేపింది.

చివరగా, ఈ ట్వీట్‌లో ఎవరినైనా గుర్తుచేసుకుంటే తనకు సంబంధం లేదని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ మాటలు వ్యంగ్యాన్ని మరింత బలపరుస్తున్నాయి. టీడీపీ నేతలు ఇంకా ఈ ట్వీట్‌పై అధికారికంగా స్పందించకపోవడం గమనార్హం. అయితే సోషల్ మీడియాలో ఈ పోస్ట్ రెండు పార్టీల అభిమానుల మధ్య తీవ్ర చర్చలకు దారితీసింది. రాజకీయాల్లో ఫుట్‌బాల్ ఆట ద్వారా వ్యంగ్యాలు కొత్త కోణం అని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# బకాయిలు గట్టెక్కేదెలా ‘ఎన్టీఆర్ వైద్య సేవ’ను వెంటాడుతున్న కష్టాలు

**ట్రస్టుకు రుణాలు ఇవ్వలేమన్న బ్యాంకులు**

**నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిల చెల్లింపునకు రూ.3 వేల కోట్ల రుణం కోరిన అధికారులు**

**రెండు సార్లు బ్యాంకర్లతో భేటీ**

**ష్యూరిటీ లేకపోవడంతో బ్యాంకర్ల నిరాకరణ**


**ఆస్తి, ఆదాయం, హామీ, తనఖాపై ప్రశ్నలు**

**వాస్తవానికి ఆస్పత్రుల బకాయిలు 2,400 కోట్లే**

**జగన్ ప్రభుత్వంలో 600 కోట్లు ‘బదలాయింపు’**

**రుణం భారమంటున్న నిపుణులు**

**ఆస్పత్రులతో మాట్లాడుకుని వాయిదాల్లో చెల్లించాలని సూచన**




**డిసెంబర్ 14 క్రైం కౌంటర్ న్యూస్ :** ఒకవైపు గతానికి మించి సంక్షేమ పథకాల అమలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు.. రెండింటికీ భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీనికితోడు గత జగన్ ప్రభుత్వంలో అడ్డగోలుగా చేసిన అప్పులు, వాటి వడ్డీల భారం. వెరసి.. కూటమి ప్రభుత్వానికి ‘ఆర్థిక’ సమన్వయంలో కష్టాలు ఎదురవుతున్నాయి. కొన్ని పథకాలకు ఒక్కోసారి నిధులు కేటాయించలేని దుస్థితి. దీంతో పథకాలు నడవాలంటే కొత్త రుణాలు తీసుకోకతప్పని పరిస్థితి. నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిల చెల్లింపు కోసం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు అధికారులు రూ.3 వేల కోట్లు అప్పు తేవాలనుకున్నారు. బ్యాంకర్లతో రెండుసార్లు సమావేశమయ్యారు. తొలి భేటీలో రెండు బ్యాంకులు సానుకూలంగా స్పందించాయి. కానీ రెండో సమావేశంలో రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా అన్నారు. ‘ట్రస్టుకు రుణాలు ఇవ్వడం సాధ్యం కాదు. పైగా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు ఆస్తులు లేవు. వచ్చే ఆదాయమూ లేదు. ఒక వేళ రుణాలు ఇచ్చినా తిరిగి ఎలా చెల్లిస్తారు? ప్రభుత్వం కూడా ష్యూరిటీ ఇవ్వడం లేదు. ఒకవేళ అది హామీ ఇవ్వాలన్నా సాధ్యంకాదు. ఇప్పటికే ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ-ఆర్థిక నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితికి చేరువైంది. పోనీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ఆస్తులు తాకట్టు పెడతారా..? అందుకు అవి అంగీకరిస్తాయా’ అని ప్రశ్నించారు. వీటికి అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలు చెల్లించడం ప్రశ్నార్థకంగా మారింది.

**అవగాహన లేకుండా హామీ..**

సాధారణంగా ప్రభుత్వంలో పనిచేసే అధికారులు.. ఏదైనా హామీ ఇచ్చే సమయంలో సాధాసాధ్యాలను పరిశీలించిన తర్వాత ముందుకెళ్తారు. కానీ ట్రస్టులకు బ్యాంకులు రుణాలు ఇస్తాయా ఇవ్వవా అన్న విషయంలో కనీస అవగాహన లేకుండా.. అప్పు తెచ్చి రెండు నెలల్లో బకాయిలు చెల్లిస్తామని ఆరోగ్య శాఖ, వైద్య సేవ ట్రస్టు అధికారులు నెట్‌వర్క్ ఆస్పత్రులకు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకే స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) సమ్మె విరమణకు అప్పట్లో అంగీకరించింది. ఇప్పుడు బ్యాంకర్ల తీరుతో పరిస్థితి తలకిందులు కావడంతో ట్రస్టు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అప్పుల కోసం బ్యాంకర్లతో మాట్లాడుకోవాలని ట్రస్టుకు సూచించిన ఆర్థిక శాఖ.. తిరిగి చెల్లించే విషయంలో హామీ ఇవ్వకపోవడంతో బ్యాంకర్లు.. రుణమివ్వడానికి నిరాకరించాయి.

ట్రస్టు సొమ్ము ఏపీ మెర్క్‌కు..వాస్తవానికి నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలు రూ.2,400 కోట్లే. కానీ ట్రస్టు అధికారులు ఏపీ మెర్క్(ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య-పరిశోధన కార్పొరేషన్)కు చెల్లించాల్సిన రూ.600 కోట్లను కూడా కలిపి మొత్తం 3వేల కోట్లు రుణంగా తీసుకోవాలని భావించారు. గత జగన్ ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏపీ మెర్క్‌ను ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు (అప్పటి ఆరోగ్యశ్రీ ట్రస్టు)లో రోగుల కోసం కేటాయించిన నిధుల్లో 15 శాతాన్ని.. అంటే రూ.600 కోట్లకుపైగా ఈ కార్పొరేషన్‌కు బదలాయించింది. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో పేద రోగులకు అందించే వైద్యం నాణ్యత తగ్గిపోయింది. కొత్త మెడికల్ కాలేజీల కోసం రోగులను నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ట్రస్టు నుంచి ఏపీ మెర్క్‌కు ఒక్క రూపాయి కూడా బదలాయించలేదు. అయితే అప్పట్లో ఇచ్చిన 600 కోట్లను కూడా కలిపి ట్రస్టు అధికారులు రూ.3 వేల కోట్ల బకాయిలు చూపిస్తున్నారు. ఆస్పత్రులకు ఇవ్వాల్సిన 2,400 కోట్లలోనూ అధిక మొత్తం బకాయిలు (రూ.1,500 కోట్లు) టాప్-50 ఆస్పత్రులకే చెల్లించాల్సి ఉంది. వీటికోసం రుణం తీసుకోవడం కంటే.. వాటితో చర్చించి.. నిర్దిష్ట సమయంలోగా సర్దుబాటు చేస్తామని ఒప్పందానికి రావాలని నిపుణులు సూచిస్తున్నారు.రోగులకు తొలి ప్రాధాన్యం..మరోవైపు.. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి రోగులకు సేవల విషయంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం లేదు. రోగులకు ఇబ్బందులు ఎదురుకాకూడదనే.. ప్రతి నెలా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు దాదాపు రూ.300 కోట్ల వరకూ విడుదల చేస్తోంది. నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మె విరమించిన తర్వాత క్రమం తప్పకుండా వాటి ఖాతాల్లో నిధులు జమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బకాయిల విషయంలోనూ తొలుత చిన్న ఆస్పత్రులకు చెల్లింపులు జరిపి.. పెద్ద ఆస్పత్రులకు వాయిదాల రూపంలో చెల్లించడం ద్వారా ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.


# సినిమా



## ‘అదే ఎక్కువైంది’..

ఇటీవల కాలంలో పలు సినిమా ఈవెంట్లు, ఫంక్షన్లకు బాగానే హాజరవుతున్నారు బండ్ల గణేష్. అయితే కొన్నిసార్లు ఈయన ఇతర హీరోలను టార్గెట్ చేస్తూ పరోక్షంగా మాట్లాడిన తీరు వివాదాలకు కారణమవుతోంది. ఇక బండ్లన్న సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు కూడా హాట్ టాపిక్ అవుతుంటాయి. అసలు విషయంలోకి వెళితే.. స్టార్ యాంకర్ సుమ రోషన్ కనకాల హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా మోగ్లీ. కలర్ ఫొటో దర్శకుడు సందీప్ రాజ్ తెరకెక్కించిన ఈ సినిమాలో సాక్షి అనే అమ్మాయి హీరోయిన్ గా నటించింది. శనివారం (డిసెంబర్ 13)న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది. మొదటి రోజు రూ.1.20 కోట్ల కలెక్షన్లు వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ క్రమంలో అల్లు అర్జున్ లాంటి పలువురు సినీ ప్రముఖులు మోగ్లీ సినిమాకు బెస్ట్ విషెస్ అందిస్తున్నారు. సినిమా సూపర్ హిట్ అవ్వాలని ఆకాంక్షించారు. తాజాగా బండ్ల గణేష్ సైతం మోగ్లీ సినిమా పై స్పందించాడు. ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాన్ని తెలియజేశాడు.“వైల్డ్ బ్లాక్‌బస్టర్” ట్యాగ్ చూశాక అనుకున్నా%ి% పోస్టర్ మాటలే, సినిమా వేరేలా ఉ ంటుందేమో అని.. కానీ సినిమా చూసాక అర్థమైంది ,పోస్టర్ ఇంకా సాఫ్ట్ గా ఉ ందని! ప్రత్యేకంగా చెప్పాలి మా సుమ రాజీవ్ కొడుకు అని స్టార్టింగ్ లో అనుకున్నా%ి% కానీ స్క్రీన్ మీద చూసాక అర్థమైంది రోషన్ కనకాల అనే నటుడు పుట్టాడు . ఇది అతని రెండో సినిమా. డైరెక్టర్ సందీప్ రాజ్ రైటింగ్, మాటల్లో సింప్లిసిటీ, సీన్స్ లో క్లారిటీ! ఇక బండి సరోజ్ కుమార్ విలనిజం, విలన్ కదా అని ఎక్కువ చేయలేదు. అదే ఎక్కువ అయ్యింది. సాక్షి అమాయకత్వం సినిమాకి చక్కని బ్యాలెన్స్! కాల భైరవ మ్యూజిక్ సీన్ కి అవసరమైన చోటే వచ్చి పని చేసింది!! విశ్వప్రసాద్ గారి సినిమా టేస్ట్ టేస్ట్ అంటే ఇదే అని మళ్లీ గుర్తు చేశారు! మొత్తానికి ం మోగ్లీ సినిమా చూసాక “వైల్డ్” అనే మాటకి అర్థం అప్‌డేట్ అయింది! కంగ్రాట్స్ టీమ్ మోగ్లీ . ఇలాంటి సినిమాలు ఇంకా రావాలి. మనం థియేటర్ లో నవ్వుతూ బయటకి రావాలి‘ అని రాసుకొచ్చారు బండ్ల గణేశ్.





## 30 రోజుల పాటు అల్లం తింటే.

అల్లంతో లెక్కలేనన్నీ ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే అల్లాన్ని ఎన్నో వైద్యులకు ఔషధంగా కూడా వినియోగిస్తారని చెబుతున్నారు. అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. దీంతో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చునని వివరిస్తున్నారు. పూర్తి డిటెల్స్‌కి వెళితే%ి

అల్లం రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుందే కాకుండా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆకలిని పెంచడంలో అల్లం బాగా సహాయ పడుతుంది.

ముఖ్యంగా చలికాలంలో వచ్చే జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటి సమస్యలను తగ్గించడానికి అల్లం బాగా పనిచేస్తుంది. ఇందులో నొప్పి, వాపును తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

అల్లంతో కలిగే లాభాల్లో ముఖ్యంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ బాధితులకు ఆకలి తగ్గిపోతుంది. అలాగే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కొన్నిసార్లు ఆకలిగా అనిపించదు. అలాంటివారికి నీళ్లల్లో నిమ్మరసం, అల్లం కలిపి ఇవ్వడం వల్ల ఆకలి పెరుగుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో అల్లం తినడం లేదా అల్లం నీరు తాగడం శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది.

ఒక నెలపాటు ప్రతిరోజూ అల్లం తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అల్లంలోని పదార్థాల వల్ల రక్తంలో ట్రైగ్లిజరైడ్‌ల పరిమాణం తగ్గుతుంది. అంతేకాదు.. ఇది చర్మాన్ని మెరిసేలా చేసి, జుట్టును బలంగా, ఒత్తుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మనస్సును ప్రశాంతంగా ఉంచడంలో కూడా ఇది ఎంతో సహాయపడుతుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఈ సహజ ఔషధాన్ని మీ రోజువారీ జీవనశైలిలో చేర్చుకోవడం మంచిది.



## ఆ వ్యాధిగ్రస్తులకు దివ్వ ఔషదం.

ఈ మధ్య కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది మజ్జిగను తీసుకోవడం మానేశారు. కానీ వారికి తెలియని విషయం ఏంటంటే మజ్జిగతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మన తాతల కాలంలో చాలా మంది ఈ మజ్జిగను ఆహారంలో చేర్చుకోవడంతో ఆరోగ్యంగా, ఎలాంటి వ్యాధుల భారీన పడకుండా ఉండేవారు. మజ్జిగ మధుమేహ రోగులకు చాలా ఉపయోగకరంగా ఉ ంటుంది. ఎందుకంటే ఇది రక్తంలో చక్కర స్థాయిను నియంత్రిండంతో పాటు శరీరానికి కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం వంటి అనేక పోషకాలను అందిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు మజ్జిగను తమ ఆహారంలో చేర్చుకుంటే ఆ సమస్యకు దూరం చేసుకోవచ్చు.మజ్జిగలో కరివేపాకు కలపడం

మన శరీరంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటే.. మన త్వరగా బలహీనంగా మారిపోతాం. అలాగే ఇది అనేక రకాల వ్యాధులకు దారి తీస్తుంది. ఒక వేళ మీరు అధిక చక్కెరతో బాధపడుతుంటే.. మీరు ఆహారంలో పెరుగుకు బదులుగా మజ్జిగను చేర్చుకోవడం ఉత్తమం. ఎందుకంటే మజ్జిగ శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. అయితే మజ్జిగలో కొన్ని కరివేపాకులు కలుపుకొని తాగడం వల్ల దాని ప్రయోజనాలను మరింత పొందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.కరివేపాకు మజ్జిగ ప్రయోజనాలు కరివేపాకు కలిపిన మజ్జిగను తాగడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇందుకోసం మనం ఒక గ్లాసు మజ్జిగలో 10 నుండి 15 కరివేపాకు ఆకులు వేసి, మూతపెట్టి, దాదాపు 1 గంట పాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత దాన్ని ఆహారంలో కలిపి తీసుకున్నా, లేదా నేరుగా తాగినా వాటి ప్రయోజనాలు మనం పొందచ్చు. కరివేపాకు మీ రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిచడంతో పాటు మూత్రపిండాల్లో రాళ్లకు కూడా తొలగిస్తుంది. అలాగే మన కంటి చూపును మెరుగు పరుస్తుంది. మీ జుట్టు సమస్యను తగ్గిస్తుంది.

గమనిక: పైన పేర్కొన్న సమాచారం కొన్ని నివేదికలు, ఇంటర్నెట్ ఆధారంగా అందించబడినవి. వీటిని టీవీ9 ధృవీకరించలేదు. వీటిని పాటించే ముందు సంబంధిత వైద్య నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం.

## 117కే సౌతాఫ్రికా ఆలౌట్

భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో భారత బౌలర్లు తమ ప్రతాపం చూపించారు. ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. సిరీస్ 1-1తో సమంగా ఉన్న నేపథ్యంలో భారత్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించి ఆధిక్యం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మ్యాచ్‌కు టీమిండియా రెండు కీలక మార్పులతో దిగింది. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్‌కు బదులుగా యువ ఆటగాళ్లు హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్‌లకు అవకాశం దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా జట్టుకు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భారత బౌలర్లు మొదటి ఓవర్ నుంచే సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ మొదటి ఓవర్‌లోనే రీజా హెండ్రిక్స్‌ను అవుట్ చేయగా, ఆ తర్వాత హర్షిత్ రాణా గత మ్యాచ్‌లో బాగా ఆడిన క్వింటన్ డి కాక్‌ను, డెవాల్డ్ బ్రెవిస్‌ను వెంటవెంటనే పెవిలియన్ పంపాడు. దీంతో పవర్ ప్లే ముగిసేసరికి సౌత్ ఆఫ్రికా కేవలం 3 వికెట్లకు 25 పరుగులు మాత్రమే చేయగలిగింది. 11వ ఓవర్‌లో శివమ్ దూబే, కార్బిన్ బాష్ వికెట్ తీయడంతో 50 పరుగులు దాటకుండానే సగం జట్టు అవుటైంది.

ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బంతితో చరిత్ర సృష్టించాడు. 7వ ఓవర్‌లో ట్రిస్టన్ స్టబ్స్ (9 పరుగులు) వికెట్ తీయడం ద్వారా హార్దిక్ పాండ్యా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తన 100వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. ఇప్పటికే 100 సిక్సర్లు కొట్టిన హార్దిక్, ఈ అరుదైన 100/100 డబుల్ రికార్డు సాధించిన తొలి భారతీయ ఆటగాడిగా నిలిచాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, కెప్టెన్ ఎయిడెన్ మార్కరమ్ మాత్రం క్రీజులో నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. వరుణ్ చక్రవర్తి తన స్పిన్‌తో డోనోవన్ ఫెరీరా (20), మార్కో జాన్సెన్‌ల వికెట్లను తీశాడు.

కెప్టెన్ మార్కరమ్ మాత్రం ధాటిగా ఆడి, 41 బంతుల్లో తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 18వ ఓవర్‌లో హర్షిత్ రాణాపై రెండు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి స్కోరు వేగాన్ని పెంచడానికి ప్రయత్నించాడు. అయితే 19వ ఓవర్‌లో మార్కరమ్ 61 పరుగుల వద్ద అర్ష్‌దీప్ సింగ్‌కు చిక్కడంతో సౌత్ ఆఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. చివరికి, సౌతాఫ్రికా జట్టు 20 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించడానికి టీమిండియా ముందు ఇప్పుడు 118 పరుగుల స్వల్ప లక్ష్యం ఉంది.



## ఇరుజట్ల ప్లేయింగ్ ఎలెవన్ ఇదే

భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఈరోజు కీలకమైన మూడో మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండో టీ20లో సౌతాఫ్రికా 51 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో ఈ రోజు మ్యాచ్ గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఉవ్విళ్లూరుతోంది. ధర్మశాల మైదానంలో సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ మొదలవుతుంది.

సాయంత్రం 6:30 గంటలకు టాస్ జరిగింది. టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ధర్మశాల మైదానంలో సాధారణంగా ముందుగా బ్యాటింగ్ చేయడం లాభదాయకం. ఇక్కడ చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ 2022లో జరిగింది. అప్పటి నుంచి ఇక్కడ జరిగిన 5 ఐపీఎల్ మ్యాచ్‌లలో నాలుగుసార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్లే విజయం సాధించాయి.ఆటగాళ్ల ఫామ్, రికార్డులు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది టీ20 ఇంటర్నేషనల్‌లో సూర్యకుమార్ 8 సార్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం కాగా, గిల్ 5 సార్లు సింగిల్ డిజిట్ స్కోర్ చేశాడు.ఈ ఫార్మాట్‌లో ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న సంజు శాంసన్, గత రెండు మ్యాచ్‌లలో ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకోలేదు. ఈ మ్యాచ్‌లో విఫలమైన శుభ్‌మన్ గిల్ స్థానంలో కాకపోయినా, శివమ్ దూబే స్థానంలో సంజు శాంసన్‌కు అవకాశం దక్కవచ్చని అంచనా వేస్తున్నారు. భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 100 వికెట్ల మైలురాయికి కేవలం ఒక వికెట్ దూరంలో ఉన్నాడు. అలాగే, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి కూడా టీ20ఐలో 50 వికెట్లు పూర్తి చేయడానికి ఒక వికెట్ అవసరం.

సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టగల సామర్థ్యం ఉన్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను భారత జట్టు మేనేజ్‌మెంట్ పట్టించుకోవడం లేదు. ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న ఆటగాడిని ఉంచాలని భావించడం వల్ల కుల్దీప్‌ను పక్కన పెడుతున్నారు. వరుణ్ చక్రవర్తితో పాటు కుల్దీప్‌ను ఆడిస్తే బ్యాటింగ్ బ్యాలెన్స్ దెబ్బతింటుందని భావిస్తున్నారు.

సౌతాఫ్రికా యువ బ్యాట్స్‌మెన్ డెవాల్డ్ బ్రెవిస్ ఈ ఏడాది టీ20 క్రికెట్‌లో 100 సిక్సర్లు కొట్టడానికి కేవలం నాలుగు సిక్సర్ల దూరంలో ఉన్నాడు. ఈ మైలురాయిని చేరుకుంటే, ఒక సంవత్సరంలో 100 ప్లస్ సిక్సర్లు కొట్టిన ఐదో ఆటగాడిగా, సౌత్ ఆఫ్రికా నుంచి రెండో ఆటగాడిగా (2024లో హెన్రిచ్ క్లాసెన్ తర్వాత) నిలుస్తాడు.

టీమ్ స్క్వాడ్‌లు భారత జట్టు (స్క్వాడ్): సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, శివమ్ దూబే, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, సంజు శాంసన్, కుల్దీప్ యాదవ్.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com